క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన కొట్టం కుమార స్వామికి రూ.26 వేల, చెరుపెల్లి కొమ్మాలుకు రూ.30 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కల్లెపు రాజశేఖర్ గౌడ్ ఆదివారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ మంజూరైందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అవుల రాములు, నాయకులు ఉప్పునూతుల లింగమూర్తి, మండల నర్సింహరాములు, పురం మల్లయ్య, మైదం సదయ్య, జన్ను రాజశేఖర్, మైదం రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



సంగెం : ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన సట్ల హరీశ్‌ను మండలంలోని ఎల్గూర్ రంగంపేటలో శాలువాతో ఆదివారం సన్మానించారు. పూలబొకే అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బందెల అంజలి రమేశ్‌బాబు, పెద్దగోని రజని వినోద్ కుమార్ దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

బీమా మంజూరు



బీమా మంజూరు పత్రాన్ని అందిస్తున్న మురావత్

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడ గ్రామానికి చెందిన ముత్యం రాజు ఇటీవల గుండె సంబంధిత వైద్యం చేయించుకోగా అతడి పాలిసీ ఉండడంతో టాటా ఆరోగ్య బీమా కంపెనీ నుంచి రూ.2,97,969 పరిహారం మంజూరైంది. ఈ క్రమంలో రాజుకు సదరు బీమా కంపెనీ మేనేజర్ మురావత్ ఆదివారం మంజూరు పత్రం అందజేసి మాట్లాడారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టాటా కంపెనీ స్థానిక సలహాదార్లు తోట రాము, ననుమాస కరుణాకర్, కుసుమ సందీప్, కాసర్ల నరేశ్, ములుక రేవంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



పర్వతగిరి : మండలంలోని వడ్లకొండకు చెందిన కట్ల శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడి స్నేహితులు రూ.90 వేల సాయం అందజేశారు. స్నేహితులు కలిసి డబ్బు సేకరించి శ్రీనివాస్ ఇద్దరు కూతుర్ల పేరిట పోస్టాఫీస్‌లో సుకన్య సమృద్ధి పథకంలో డిపాజిట్ చేసి పట్టాను బాధిత కుటుంబానికి ఆదివారం అందించారు. మిత్రుడి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

మదిరలో..



దుగ్గొండి : మండలంలోని మదిరకు చెందిన బూర్గుల యువరాజు ఇటీవల మృతి చెందగా అతడి కుటుంబానికి అతడి పదో తరగతి నాటి మిత్రులు ఆదివారం రూ.51 వేల సాయం అందజేశారు. తొలుత యువరాజు చిత్రపటానికి అతడి మిత్రులు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



ఖానాపురం : విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందిన ఘటన మండల కేంద్ర శివారులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఊరటి కుమార స్వామికి చెందిన పాడి గేదెలు ఖానాపురం శివారులోని కాకులగుడ్డాల్ కాల్వ దిశగా మేతకు వెళ్లాయి. ఈ క్రమంలో బావుల వద్దకు వెళ్తున్న సర్వీస్ వైర్ తగిలి గేదె విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధిత రైతు తెలిపారు. విద్యుత్ అధికారులు తనకు పరిహారం అందించి న్యాయం చేయాలని రైతు కోరుతున్నారు.

‘ఖరీఫ్’ సాగుకు సమాయత్తం

- పత్తి, మొక్కజొన్న విత్తుతున్న రైతులు
- మండలంలో 29 వేల ఎకరాల్లో..



పత్తి విత్తనాలు నాటుతున్న రైతులు



మొక్కజొన్న విత్తనాలు వేస్తున్న రైతులు

సంగెం : రోహిణి కార్తెలో ఎండలకు రోళ్లు పగులుతాయన్న నానుడి తెలిసిందే. రోహిణి కార్తెను బలమైనదిగా రైతులు నమ్మడం పరిపాటి. అందుకే ఈ కార్తెలో విత్తనాలు వేయడంతోపాటు వరి నారు కూడా పోస్తుంటారు. గతంలో ఈ కార్తెలో దుక్కులు చేసుకుని పొడి దుక్కిలో పత్తి విత్తనాలు నాటడం ఆనవాయితీ. తర్వాత నైరుతి రుతుపవనాల రాక ప్రారంభం కాగానే తొలకరి జల్లులకు పత్తి విత్తనాలు మొలిచేవి. కాగా ఈ ఏడాది అందుకు భిన్నంగా రోహిణి కార్తెలో అల్పపీడనాల కారణంగా కురిసిన వర్షాలకు తోడు రుతుపవనాలు కూడా ముందస్తుగానే రావడంతో మండలంలో కురిసిన వానలకు రైతులు మొక్కజొన్న, పత్తి విత్తనాలు నాటుతున్నారు. దుక్కులు చేయని చేలల్లో గత ఏడాది వేసిన పత్తి, మిర్చి, మొక్కజొన్న తదితర పంటల కట్టెలను తొలగించి శుభ్రం చేస్తున్నారు. కొందరు రైతులు పశువులు, కోడి ఎరువును చేలకు తోలుతున్నారు.

సాగు విస్తీర్ణం 29 వేల 50 ఎకరాలు

మండలంలో సాగుకు అనువైన వ్యవసాయ భూమి 29 వేల 50గా గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో 8 వేల ఎకరాల్లో వరి, 14 వేల 500 ఎకరాల్లో పత్తి, 5 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 700 ఎకరాల్లో ఆయిల్ పామ్, 300 ఎకరాల్లో పసుపు, 200 ఎకరాల్లో కంది, 100 ఎకరాల్లో మిర్చి, మిగతా సాగు భూమిలో కూరగాయలు, ఇతర పంటలు పండిస్తారని వ్యవసాయశాఖ అధికారి యాకయ్య తెలిపారు.

వేసవిలో లోతైన దుక్కులు

వేసవి దుక్కులతో కలిగే ప్రయోజనాలపై గతంలో గ్రామాల్లో నిర్వహించిన రైతు చైతన్య యాత్రల్లో వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. దీంతో రైతులు వేసవి దుక్కులను జోరుగా దున్నుతున్నారు. వేసవిలో లోతైన దుక్కులతో వర్షపు నీరు భూమిలో ఇంకి పంటలకు మేలు కలుగుతుందన్న ఆశతో ట్రాక్టర్లతో దుక్కులు దున్నిస్తున్నారు. గత ఏడాది తరహాలోనే ఈ ఏడాది కూడా సకాలంలో వర్షాలు కురిస్తే పంటలు బాగా పండుతాయని రైతులు ఆశిస్తున్నారు.

పెట్టుబడి భరోసాతో ముందుకు..

ప్రభుత్వం ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభానికి ముందుగానే పంటల పెట్టుబడికి రైతులు బ్యాంకులు, ప్రయివేటు వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగకుండా ఉండేలా కేంద్రం కిసాన్ సమ్మాన్ పథకం ద్వారా రైతులకు ఎకరాకు రూ.6 వేలు, రైతు భరోసా ఎకరాకు రూ.12 వేలు పెట్టుబడికి అందించనుంది. దీంతో ఈసారి రైతులు ముందస్తుగానే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి సకాలంలో పంటలు సాగు చేయడానికి ముందుకు సాగుతున్నారు. రైతు భరోసాను పంట ప్రారంభానికి ముందే బ్యాంకు ఖాతాల్లో వేయడంతోపాటు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలని మండలానికి చెందిన రైతులు కోరుతున్నారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి



ముందస్తు వానలకు ఈసారి పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేశాం. ఇప్పుడే ఎరువుల దుకాణాల్లో డీఏపీ, ఇతర ఎరువులు లేవంటున్నారు. ప్రారంభంలోనే సరుకుల కొరత ఉంటే ఇక సీజన్‌లో పరిస్థితి ఎలా ఉంటుందో అని ఆందోళనగా ఉంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఖరీఫ్ కు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచాలి.

– మెంతుల కుమారస్వామి

డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి



గ్రామాలకు వచ్చి విత్తనాలు విక్రయించే వారి వద్ద కొనుగోలు చేయవద్దు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే బ్రాండెడ్ కంపెనీల విత్తనాలు కొనుగోలు చేయాలి. వ్యాపారస్తుల మాటలపై ఆధారపడకుండా వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి. బిల్లులు తీసుకోవడంతోపాటు పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలి.

– సీహెచ్.యాకయ్య, ఏఓ, సంగెం

వేడుకగా శివపార్వతుల కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు, హాజరైన భక్తులు

నల్లబెల్లి : మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం శివపార్వతుల కల్యాణం వేడుకగా నిర్వహించారు. తొలుత ఆలయ ప్రధాన అర్చకుడు పెందోట మురళి మోహనచారీ ధ్వజారోహణం, రుద్రాభిషేకం, రుద్రహోమం పూజలు నిర్వహించారు. కల్యాణం అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలను ప్రధాన వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్తలు తాటిపల్లి సదానందం, రవీందర్, సుదర్శన్, మనోజ్ కుమార్ దంపతులతోపాటు ఆలయ కమిటీ చైర్మన్ గందె శ్రీనివాస్ గుప్తా, మాజీ జెడ్పీటీసీ పెద్ది స్వప్న, ప్రముఖ వైద్యుడు జాటోత్ ఉదయ్ సింగ్, అన్నదాత నానబోయిన రాజారాం, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ‘భూభారతి’ సదస్సులు

సంగెం : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రేపటి (ఈనెల 3) నుంచి మండలంలో భూభారతి చట్టంపై సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ గనిపాక రాజ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న వెంకటాపూర్, తిమ్మాపూర్, 4న కాట్రపల్లి, చింతలపల్లి, 5న కాపులకనిపర్తి, పల్లారుగూడ, 6న రామచంద్రాపూర్, పల్లారుగూడ, 9న గవిచర్ల, మొండ్రాయి, 10న గవిచర్ల, ముమ్మడివరం, 11న లోహిత, నార్లవాయి, 12 షాపూర్, ఎల్గూర్ రంగంపేట, 13న ఎల్గూర్ రంగంపేట, 16న నల్లబెల్లి, సంగెం, 17న సంగెంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద సదస్సులు ఉంటాయని పేర్కొన్నారు. రైతులు, ప్రజలకు భూసమస్యలపై అవగాహన కల్పించడంతోపాటు సదస్సు అనంతరం సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తామని వివరించారు. భూసమస్యలపై పాత రికార్డులు, దస్తావేజులు జతచేసి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

గీసుకొండ : మండలంలో ఈనెల 3న కొమ్మాల, పోతరాజుపల్లి, 4న బొడ్డు చింతలపల్లి, రామచంద్రాపూర్, 5న ధర్మారం, అనంతారం, 6న వంచనగిరి, ఊకల్, 9న మొగిలిచెర్ల, మచ్చాపూర్, 10న గొర్రెకుంట, మనుగొండ, 11న గీసుకొండ, శాయంపేట, 12, విశ్వనాథపూర్, 13న ఎల్కుర్తి హవేలి భూభారతి చట్టంపై సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రియాజొద్దీన్ ఓ ప్రకటనలో తెలిపారు. చట్టంపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు సదస్సులకు హాజరై భూసమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రాయపర్తి : ఈనెల 3న గన్నారం, తిర్మలాయపల్లి, 4న బురహాన్‌పల్లి, 5న కేశవాపురం, కొలన్‌పల్లి, 6న గట్టికల్, ఊకల్, 9న మొరిపిరాల, మైలారం, 10న పెర్కవేడు, కొత్తూరు, 11న పోతిరెడ్డిపల్లి, కాట్రపల్లి, 12న సన్నూరు, జగన్నాథపల్లి, 13న సన్నూరు, కొండాపురం, 16–17 తేదీల్లో రాయపర్తిల్లో గ్రామసభలు నిర్వహిస్తామని తహసీల్దార్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. సదస్సు అనంతరం సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. అన్ని గ్రామాల ప్రజలు సదస్సులను వినియోగించుకోవాలని కోరారు.

దుగ్గొండి : 3న అడవి రంగాపురం, మదిర గ్రామాల్లో, 4న చలపర్తి, మందపల్లి, 5న రేకంపల్లి, తొగర్రాయి, 6న తొగర్రాయి, నాచినపల్లి, 9న మహ్మదాపురం, తిమ్మంపేట, 10న వెంకటాపురం, రేబల్లె, 11న కేశవాపురం, లక్ష్మీపురం, 12న ముద్దునూరు, పోలారం గ్రామాల్లో సభలు ఉంటాయని డిప్యూటీ తహసీల్దార్ ఉమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు, ప్రజలు సభలకు హాజరు కావాలని కోరారు.

జాగృతి పేరుతో కొత్త నాటకానికి తెర

- కాంగ్రెస్ అధికార ప్రతినిధి సహదేవ్

వర్ధన్నపేట : ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఇరుక్కున్న మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత జాగృతి పేరుతో కొత్త నాటకానికి తెర లేపుతోందని కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ అధికార ప్రతినిధి బర్ల సహదేవ్ ఎద్దేవా చేశారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో లక్ష కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం పదేళ్ల పూర్తి కాక ముందే కూలి పోవడం అవినీతికి అద్దం పడుతోందన్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి నాసిరకం పనులు చేయించిన నాటి సీఎం కేసీఆర్‌కు నోటీస్ ఇస్తే తెలంగాణకు ఇచ్చినట్లు ఎలా అవుతుందన్నారు. బీఆర్ఎస్ స్కీములు, స్కాములతో అన్ని వర్గాల ప్రజలనూ వంచించడంతోనే ఆ పార్టీని అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించారని తెలిపారు. జాగృతి సంస్థకు తెలంగాణలో చోటు లేని పరిస్థితి నెలకొందని చెప్పారు.

పట్టణంలోనే ‘ఇంటిగ్రేటెడ్’ ఏర్పాటు చేయాలి

- బీఆర్ఎస్ యూత్ జిల్లా నాయకుడు సోము

వర్ధన్నపేట : కేంద్రం ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను నియోజకవర్గ కేంద్రమైన వర్ధన్నపేట పట్టణంలోనే ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ యూత్ విభాగం జిల్లా నాయకుడు మన్నూరు సోము డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గానికి ఇప్పటివరకు మంజూరైన గురుకుల, ఇతర విద్యాలయాలను స్థానికంగా కాకుండా ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేయడంతో విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. సుమారు రూ.200 కోట్ల అంచనా వ్యయంతో తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ లక్ష్యం నెరవేరేలా నియోజకవర్గ కేంద్రంలోనే ఏర్పాటు చేసే దిశగా స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు చొరవ చూపాలని కోరారు. ఇతర ప్రాంతంలో ఏర్పాటుకు యత్నిస్తే పోరాటాలు తప్పవని స్పష్టం చేశారు.

‘చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి’



చెట్లు నరికిన ప్రదేశాన్ని చూపుతున్న రవి

నెక్కొండ : మండలంలోని అలంకానిపేట గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో చెట్లను నరికేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఉపసర్పంచ్ మాదాసు రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సదరు ప్రకృతి వనాన్ని గ్రామస్తులతో కలిసి ఆయన ఆదివారం సందర్శించి ధ్వంసమైన చెట్లను పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో ప్రత్యేక అధికారుల పాలన ఉండడంతో గ్రామానికి చెందిన పి.యాకయ్య, ఆర్.వెంకన్న సుమారు 150 చెట్లను నరికేశారని ఆరోపించారు. ఘటనను గ్రామ పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు.

పరామర్శ

నర్సంపేట : చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి ఇటీవల గుండె పోటుతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్, ప్రముఖ న్యాయవాది ముద్దసాని సహోదర్‌రెడ్డి, ఆ పార్టీ చెన్నారావుపేట మండల ఇన్‌చార్జ్ బాల్నె వెంకన్న ఆదివారం పరామర్శించారు. తొలుత సత్యనారాయణరెడ్డి చిత్రపటానికి సహోదర్‌రెడ్డి, వెంకన్న నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ భానోతు పత్తినాయక్, సొసైటీ చైర్మన్ చింతకింది వంశీ, మాజీ సర్పంచ్‌లు కుండె మల్లయ్య, అనుముల కుమారస్వామి, నాయకులు కొండవీటి ప్రదీప్‌కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్లు జంగిలి రాజు, భానోతు పూల్ శంకర్, జున్నూతుల మహేందర్ రెడ్డి, ఎడ్ల నారాయణరెడ్డి, ములుక సాంబయ్య, ఎరుకల రాజ్‌కుమార్, మట్ట భిక్షపతి, రవి, సీఈఓ చిట్టె రవి, తదితరులు పాల్గొన్నారు.

చర్చి అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న కొండూరు గ్రామస్తులు

రాయపర్తి : మండలంలోని కొండూరులో అక్రమంగా చర్చి నిర్మాణం చేపడుతున్నారంటూ తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై శ్రవణ్‌కుమార్‌లకు గ్రామ యువకులు ఆదివారం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిలో అనుమతి లేకుండా చర్చి నిర్మాణం చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చర్చి నిర్మాణాన్ని నిలిపే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో గ్రామానికి చెందిన పుల్ల రవీందర్, పంతంగి రేవంత్, జక్కుల సందీప్, ల్యాదల్ల ప్రశాంత్, పోర్ల మహేశ్, జిట్టబోయిన రాజు, ఈరెడ్డి భరత్, నాగపురి విజయ్, పోలె వంశీ, దాసరి భాస్కర్, పూస అజయ్, అబ్బోజు రాకేశ్, శీల రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆపరేషన్ కగార్’ను నిలిపేయాలి

- సీపీఐ(ఎంఎల్) నాయకుడు విజయ్‌కుమార్



సదస్సులో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

నర్సంపేట : ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన హత్యాకాండను నిలిపేయాలని సీపీఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ నాయకుడు గుర్రం విజయ్‌కుమార్, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఆరెల్లి కృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలోని సిటిజన్ క్లబ్ ఆవరణలో బుర్ర ఆనంద్, మొగిలి ప్రతాప్‌రెడ్డి, మండల యుగంధర్ అధ్యక్షతన ఆల్ ఇండియా కేత్ మజ్దూర్ కిసాన్ సభ, అఖిల భారత రైతు కూలీ సంఘం, రైతు కూలీ సంఘం (ఆర్‌సీఎస్) సదస్సు ఆదివారం నిర్వహించారు. తొలుత క్లబ్ నుంచి అంబేడ్కర్ సెంటర్ మీదుగా అమరవీరుల స్తూపం వరకు ఆపరేషన్ కగార్ వ్యతిరేక నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సదస్సులో విజయ్ కుమార్, కృష్ణ మాట్లాడారు. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టే దిశగా కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలు, మావోయిస్టులపై మిలిట్రీ, సైనికులు, వేలాది మంది పోలీసు బలగాలతో ముప్పేట దాడి కొనసాగిస్తోందని తెలిపారు. ఇటీవల జరిగిన అన్ని ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని, కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, పెసా, అటవీ హక్కుల చట్టంలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారాన్ని అడ్డుపెట్టుకొని దేశాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకుడు చిన్న చంద్రన్న, ప్రముఖ కవి గొట్టిముక్కుల యోచన, టీటీఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి మహబూబ్ అలీ, ఏఐఎఫ్‌టీయూ (న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేషం, టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు జనగాం కుమారస్వామి, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు మద్దెల సరళ, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదివితే మెరుగైన ఫలితాలు



రాయపర్తి : మాట్లాడుతున్న రవీందర్‌రావు



దుగ్గొండి : ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

- ‘వందేమాతరం’ అధినేత రవీందర్‌రావు

రాయపర్తి : లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే మెరుగైన ఫలితాలు వస్తాయని వందేమాతరం ఫౌండేషన్ అధినేత రవీందర్‌రావు తెలిపారు. మండలంలోని కాట్రపల్లిలోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో 2018 నుంచి 2024 వరకు పదో తరగతి చదువుతున్న విద్యార్థులతో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థుల నడవడిక, భవిష్యత్, లక్ష్యాలపై అవగాహన కల్పించారు. పాఠశాల స్థాయిలోనే భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శిశుపాల్, డైరెక్టర్లు వెంకట్‌రెడ్డి, సోమన్న, రవీనా, రాజు, రమేశ్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

గిర్నిబావిలో..

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావి గ్రామంలోని శ్రీ చైతన్య గురుకుల హైస్కూల్‌లో 1993–94 విద్యాసంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పదో తరగతి తర్వాత సుమారు 31 ఏళ్ల తర్వాత కలుసుకుని ఆనందంలో మునిగి తేలారు. నాటి తరగతి గదులను సందర్శించి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. స్నేహం కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. నాటి ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు కూస సంపత్‌కుమార్, పల్లాటి కేశవరెడ్డి, గొట్టిముక్కల రమేశ్, కన్నెబోయిన కుమారస్వామి, కాల్వ శ్రీనివాసరెడ్డి, శేషారెడ్డి, యుగంధర్, అఫ్జల్ పాషా, మల్హర్‌రావు, సద్ది మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూల్‌లో ‘రాబిన్ హుడ్’ సేవలు

- విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ



విద్యార్థులకు పండ్లు అందిస్తున్న వలంటీర్లు

నల్లబెల్లి : కార్పొరేట్ స్కూళ్ల ప్రచార ఆర్భాటాలతో ప్రభుత్వ పాఠశాలలు పేద విద్యార్థుల నిలయాలుగా మారిపోయాయన్న వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో ప్రభుత్వ స్కూళ్లలో ప్రజల సహకారంతో విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం గతేడాది ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయుడు పురాం భద్రీనాథ్ ‘రాబిన్ హుడ్ ఆర్మీ’ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలల్లో సేవలు అందిస్తున్న తన శిష్యుడు అనుముల నితిశ్‌ను సంప్రదించగా సదరు స్కూల్‌లో సేవలకు బాటలు పడ్డాయి. మండలంలో రాబిన్ హుడ్ ఆర్మీ వాలంటీర్లు అనుముల నితీశ్, వైనాల మధు, కడియాల విజయ్ కుమార్, చెట్టి రమేశ్, ఉడుత రాజు స్థానిక ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు బిస్కెట్లు, అరటిపండ్లు ఇస్తున్నారు.

2024 జూలై నుంచి..

పాఠశాలలో చదవుతున్న 60 మంది విద్యార్థులకు 2024 జులై నుంచి ప్రతి బుధవారం పండ్లు, బిస్కెట్లు అందిస్తున్నారు. నర్సంపేటకు చెందిన నితీశ్ తన మిత్రులు వైనాల మధు, ఉడుత రాజు కలిసి విద్యార్థులకు ఉదయం ఇంటర్వెల్ సమయంలో బిస్కెట్ ప్యాకెట్లు, అరటిపండ్లు అందిస్తున్నారు. కాగా బడి బాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో లభిస్తున్న వసతులు, సౌకర్యాలతోపాటు రాబిన్ హుడ్ ఆర్మీ సేవలను ఉపాధ్యాయులు వివరిస్తూ పాఠశాలల్లో అడ్మిషన్లు సాధిస్తున్నారు.

సేవలను విస్తృతపరుస్తాం

ప్రభుత్వ పాఠశాలల బలోపేతం దిశగా సేవలను విస్తృత పర్చుతాం. స్కూల్‌లో ఏడాదిగా పండ్లు, బిస్కెట్లు అందిస్తున్నాం. సేవలు పెంచుతాం.

– అనుముల నితీశ్, వలంటీర్

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

నల్లబెల్లి : అనారోగ్యంతో బాధపడుతూ బావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రుద్రగూడెంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై గోవర్ధన్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దేవులపల్లి మల్లమ్మ (80) భర్త సమ్మయ్య 15 ఏళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో మల్లమ్మ నాటి నుంచి కుమారుడు నర్సింహస్వామి కుటుంబ సభ్యులతో కలిసి ఉంటూ జీవనం కొనసాగిస్తుంది. ఆమె కొన్నేళ్లుగా కడుపునొప్పి, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతోంది. ఈ క్రమంలో కడుపునొప్పితో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు శనివారం ఆస్పత్రికి తీసుకెళ్లగా కడుపులో గడ్డలు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మల్లమ్మ ఆదివారం ఇంటి సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బావి నుంచి మల్లమ్మ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలి కుమారుడు నర్సింహస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చర్యలు తీసుకుని న్యాయం చేయండి

పర్వతగిరి : తన భూమిలో విత్తనాలు వేసి సాగు చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని మండలంలోని ఏనుగల్‌కు చెందిన మహిళా రైతు బొలుగొడ్డు స్వరూప కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఆమె విలేకరుల ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. సర్వే నంబర్ 499/ఏలో తనకు 37 గుంటల భూమి ఉండగా కౌలుకు ఇచ్చినట్లు తెలిపారు. కౌలుదారులను గ్రామానికి చెందిన కానుగంటి నవీన్, నల్లపు సౌందర్య, నల్లపు ఉష, వద్దె రాణి దున్నకుండా అడ్డుకుని బూతులు తిట్టినట్లు తెలిపారు. ఎస్సైకి ఫోన్ చేసి సమస్యను వివరించగా కానిస్టేబుల్‌ను పంపించగా విచారణ చేపట్టి నవీన్ బృందాన్ని భూమిలో విత్తనాలు వేయొద్దని చెప్పారని వివరించారు. అయినా విత్తనాలు వేశారని వాపోయారు. కోర్టు ద్వారా తనకు పూర్తి హక్కులున్నాయని తెలిపారు. పోలీస్ కమిషనర్ స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.